శుభకారిణి.. సౌభాగ్య ప్రదాయిని

- శ్రీ మహాలక్ష్మికి భక్తిశ్రద్ధలతో పూజలు
- వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

సీతంపేట: సౌభాగ్యాన్ని, సిరిసంపదలను ప్రసాదించే వరలక్ష్మి వ్రతాన్ని ఉత్తర నియోజకవర్గంలో మహిళలు భక్తి శ్రద్ధలతో ఆచరించారు. శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అక్కయ్యపాలెం శ్రీ లలితాపీఠం, సీతంపేట పార్వతీశ్వరాలయం, రామచంద్రానగర్ మహాలక్ష్మి సహిత శివసాయి ఆలయం, శ్రీనివాస నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాలలో అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు.

బంగారు చీరలో లలితాదేవి

అక్కయ్యపాలెం లలితానగర్ శ్రీలలితాపీఠంలో లలితాదేవి బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం 9 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శ్రావణమాసం రెండో శుక్రవారం కావడంతో ఉదయం వ్రతం చేసుకుని సాయంత్రం అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం వద్ద జనం క్యూ కట్టారు. పూలమాలలు, పట్టు వస్త్రాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు జరిపారు. మధ్యాహ్నం పీఠంలో నిర్వహించిన విశేష అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.




బంగారు చీర అలంకరణలో లలితాదేవి, లలితా పీఠం వద్ద బారులు తీరిన భక్తులు



శ్రీనివాసనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రామచంద్రానగర్‌లో..

స్థానిక రామచంద్రానగర్‌లో మహాలక్ష్మి సహిత శివ సాయి ఆలయంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు చేశారు. పలువురు మహిళలు పాల్గొని వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. ఆలయ అర్చకులు ధూప, దీప, నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి నక్షత్ర హారతి ఇచ్చారు. మహిళలు లలితా సహస్రనామాలు పఠించారు.

శ్రీనివాస నగర్‌లో..

శ్రీనివాసనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మి, గోదాదేవి, పద్మావతి అమ్మవార్లకు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పరిసర ప్రాంత మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. ఆలయ అర్చకులు భక్తుల గోత్రనామాలతో అర్చన చేసి, అనంతరం అమ్మవారికి కుంకుమ పూజ చేశారు.

దుర్గమ్మకు కుంకుమ పూజలు

సీతమ్మధార: స్థానిక నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల శ్రీ మహాగణపతి ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్పస్వామి శ్రీ షిరిడీసాయిబాబా దేవస్థానంలో గల దుర్గమ్మ వారికి శుక్రవారం కుంకుమపూజలు చేశారు. శ్రీచక్రానికి విశేష పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం, భక్తుల గోత్రానామాలతో పూజలు చేశారు. అమ్మవారిని గాజులు, పువ్వులతో అలంకరించి, ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెచ్చిన పసుపు, కుంకుమ, గాజులతో అమ్మవారికి పూజలు చేశారు.



లలితానగర్‌లో లలితాదేవి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



నార్త్ ఎక్స్‌టెన్షన్ ఆలయంలో దుర్గమ్మ సన్నిధిలో శ్రీచక్రానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

నైవేద్యాలు నివేదించారు. శ్రావణమాసం సందర్భంగా ప్రతిరోజూ భక్తులు లలితా సహస్ర పారాయణం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో అర్చకుడు వంశీ, దేవస్థానం సిబ్బంది శివ, స్థానికులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవం



దుర్గాగణపతికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతంపేట: సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఆలయ 32వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, ప్రత్యేక అలంకరణ, గణపతి హోమం, విశేష పూజాకార్యక్రమాలు జరిపారు. సాయంత్రం 108 కలశాలతో గణపతి ఉత్సవ విగ్రహం ఊరేగింపు పురవీధుల్లో కనుల పండువగా సాగింది. ముఖ్య అతిథి ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు స్వామి వారిని దర్శించి పూజలు చేశారు. అనంతరం పల్లకీ ఊరేగింపును ప్రారంభించారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన సంగీత కచేరీ

మహారాణిపేట: జిల్లా పరిషత్ దరి శ్రీ కృష్ణ చైతన్య మఠంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా శుక్రవారం ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో కచేరీ నిర్వహించారు. సంగీత శిక్షకుడు ఆకొండి వెంకటరావు ఆధ్వర్యంలో పలువురు లలిత సంగీతం, ఆధ్యాత్మిక గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి జగన్మోహనరావు, కోశాధికారి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ బొత్సకు కె.కె.రాజు అభినందన



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖలోని ఆయన నివాసంలో బొత్సను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అన్నంరెడ్డి అదీప్ రాజ్ పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలకు గుర్తింపు

సీతంపేట: డాక్టర్ చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న పలువురికి గౌరవ డాక్టరేట్లు, జాతీయ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ వ్యవస్థాపకుడు దోమన చిన్నారావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా సమాజ సేవలో ఉన్నామని, 14 రాష్ట్రాల్లో సభ్యులు ఉన్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 1,250 మందికి జాతీయ అవార్డులు అందజేశామన్నారు. ఈ సందర్భంగా 26 మందికి అతిథుల చేతుల మీదుగా అవార్డులు, డాక్టరేట్లు అందించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి దాడి సురేష్, జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, డాక్టర్ జి.అర్జున, ఎం.వి.మురళీమోహన్, బి.శంకరరావు, గుండపు నాగేశ్వరరావు, తేజగౌడ్, బంగారు చిట్టి, నాగేశ్వరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలోని హెచ్‌టీ లైన్లపై నిర్వహణ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ(ఆపరేషన్స్) బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు శంకువానిపాలెం, సరోజిని హాస్పిటల్ ప్రాంతం, జగ్గారావు బ్రిడ్జి ప్రాంతం, చిన్నూరు, 80 ఫీట్ రోడ్డు, జీవీఎంసీ హైస్కూల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

ప్లాస్టిక్ నిషేధం తప్పనిసరి

సీతంపేట: ప్లాస్టిక్ సకల జీవరాశికి ప్రమాదాన్ని కలిగించే స్థాయికి చేరుకుందని, ప్లాస్టిక్‌ను నిషేధించాల్సిన అవసరం ఉందని ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ (ఐటీఎల్) వి.హేమశైలజ అన్నారు. పర్యావరణ నెట్‌వర్క్ కన్వీనర్ కె.విజయబాబు అధ్యక్షతన ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధం ఆవశ్యకతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధం కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ ఎస్.రవికుమార్, ఉమెన్ ఎన్జీవో ఇందిరా ప్రియదర్శిని, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాఖీల సందడి

- ఈ నెల 19న రాఖీ పౌర్ణమి
- జోరుగా విక్రయాలు



పలు వెరైటీల్లో రాఖీలు



ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద రాఖీల అమ్మకాలు

కంచరపాలెం: అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందడి ముందుగానే మొదలైంది. ఈ నెల 19 సోమవారం రాఖీపౌర్ణమి కావడంతో కంచరపాలెం, తాటిచెట్లపాలెం, జ్ఞానాపురం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం పరిసర ప్రాంతాల్లో రాఖీల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దూర ప్రాంతాల్లో ఉన్నవారికి రాఖీలు పంపడానికి ఇప్పటికే చాలామంది కొనుగోలు చేశారు. మారిన కాలానికి అనుగుణంగా కొత్త రకం రాఖీలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. పెద్ద దుకాణాలతో పాటు ఫుట్‌పాత్‌లపై, అలాగే చిన్న చిన్న స్టాల్స్ వేసి రాఖీలు విక్రయిస్తున్నారు.

విజ్ఞానానికి వేదికలు గ్రంథాలయాలు

అల్లిపురం: గ్రంథాలయాలు విజ్ఞానానికి వేదికలని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు అన్నారు. వెంకటేశ్వరమెట్టపై గల శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయంలో గ్రంథాలయం పునః ప్రారంభ కార్యక్రమంలో ఆయనతో పాటు 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా కొంత సమయాన్ని గ్రంథాలయంలో గడపాలన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు పొలమరశెట్టి శ్యామ్, పొలమరశెట్టి శ్రీను, కోశాధికారి నర్సింగరావు, భీశెట్టి గోపీకృష్ణ, కార్యవర్గ సభ్యులు శరగడం భాస్కర్, మోహన్, బాబాజీ, సన్యాసిరావు, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు

జూనియర్ వైద్యులకు మద్దతు

- నేడు ప్రభుత్వ వైద్యుల నిరసన

మహారాణిపేట: దేశం యావత్తు తలదించుకునేలా ఒక పీజీ డాక్టర్‌పై జరిగిన అరాచకత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ దేశవ్యాప్త జూనియర్ డాక్టర్ల ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ సంఘీభావం తెలుపుతోందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడకాల శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు, పీజీ విద్యార్థులు, డాక్టర్లు అత్యవసర పరిస్థితిని కూడా బహిష్కరించి ఉద్యమం చేస్తున్న వేళ.. ప్రభుత్వ డాక్టర్లు ఎటువంటి ఆందోళనలు చేయకుండా పేద రోగుల చికిత్సకు పూర్తిగా సహకరించాలని అసోసియేషన్ రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. శనివారం నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరు కావాలన్నారు. తమ అసోసియేషన్‌తో సంబంధం లేని కొంత మంది వ్యక్తులు ఉనికి కోసం ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ పేరుతో బాధ్యతారాహిత్యంగా గంట పాటు విధులు బహిష్కరించి ధర్నా చేయాలని పిలుపునివ్వడం చట్టరీత్యా నేరమని, వారిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

బలమైన శక్తిగా భారత్ అవతరించాలి

సీతంపేట: భారతదేశం బలమైన శక్తిగా అవతరించాలని ఢిల్లీ సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ కమొడోర్ సి.ఉదయభాస్కర్ ఆకాంక్షించారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ఆధ్వర్యంలో భారతదేశ విదేశాంగ విధానానికి సంబంధించి వ్యూహాత్మక కార్యాచరణపై శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను చర్చిస్తూ రాబోయే కొన్ని నెలలు అక్కడి పరిస్థితులను నిశితంగా గమనించాలన్నారు. పొరుగున చైనా రాజకీయంగా, ఆర్థికంగా, సైనిక పరంగా బలమైన శక్తిగా ఉందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. 1971కి ముందు పరిస్థితులు బంగ్లాదేశ్‌లో రాగలవా అనే విషయంలో వేచి చూడాలని, ఇప్పుడు మనం అలీన విధానం నుంచి పక్కకు జరిగామని, ప్రపంచంలో మూడో బలమైన శక్తిగా భారత్ అవతరించాలని అభిలషించారు. పాత్రికేయుడు కె.వి.ప్రసాద్ మాట్లాడుతూ హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత్ ఆధిపత్యం సాధించాలని చెప్పారు. పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఎ.ప్రసన్నకుమార్ సభకు అధ్యక్షత వహించారు.



మాట్లాడుతున్న కమొడోర్ ఉదయభాస్కర్

వాజ్‌పేయికి నివాళి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పరశురాంరాజు తదితర నాయకులు

సీతమ్మధార: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమం శుక్రవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి పరశురాంరాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కొప్పిశెట్టి శంకరరావు, 14వ వార్డు అధ్యక్షుడు రాకేష్, 43, 45 వార్డుల అధ్యక్షులు నాగరాజు, వీరబాబు, జామి శ్రీనివాస్, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య

గోపాలపట్నం: క్షణికావేశంలో బుచ్చిరాజుపాలెం దరి సీతారామరాజునగర్‌లో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. పి. అనూష(25) సీతారామరాజుగర్‌లో కుటుంబంతో నివాసముంటోంది. భర్త చెన్నైలో మేకప్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పిల్లలను అత్త కోసం టిఫిన్ తీసుకు రమ్మని పంపించింది. అయితే పిల్లలు వచ్చే సరికి ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందింది. స్థానికులు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు చేరుకుని వివరాలు సేకరించారు.

రూ. 90 వేల కోసం ..

మృతురాలి వద్ద సూసైడ్ నోట్ లభ్యమయింది. అత్తకు తెలియకుండా ఆమె ఖాతాలో రూ.90 వేలు వాడేశాను.. భర్త పలాసలో వివాహానికి హాజరయ్యేందుకు వస్తున్నారు.. డబ్బు గురించి అడిగితే సమాధానం చెప్పుకోలేను.. పిల్లలను నా తమ్ముడు చూసుకుంటాడు. నా చావుకు ఎవరూ కారణం కాదని లేఖలో పేర్కొంది.



అనూష మృతదేహం

భర్త ఇంటికి చేరుకునే లోగా శవమై..

మరో అరగంటలో భర్త వెంకటరమణ ఇంటికి చేరుకుంటాడన్న సమయానికి భార్య ఆత్మహత్య చేసుకోవడంతో లబోదిబోమని విలపించారు. నాన్నతో కలసి పెళ్లికి వెళ్దామని పిల్లలను ఉదయాన్నే లేపి వేగంగా తయారు కావాలని చెప్పింది. నానమ్మకూడా వస్తుంది. ఆమెకు టిఫిన్ తీసుకు రావాలని పంపింది. ఇంతలో పిల్లలను అనాథలు చేసే నిర్ణయం తీసుకుందని బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ప్రయివేటు పాఠశాలలో 1వ తరగతి, 5వ తరగతి చదువుతున్నారు. భర్త వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ చక్రధరరావు పర్యవేక్షణలో హెచ్‌సీ శివసాగర్ దర్యాప్తు చేపట్టారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

'మైనారిటీ సమితి' జిల్లా అధ్యక్షుడిగా అస్లం ఖాన్

సీతమ్మధార: రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా 14వ వార్డు సీతమ్మధారకు చెందిన మహ్మద్ అస్లం ఖాన్ నియమితుడయ్యారు. సీతమ్మధారలోని ఒక హోటల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ ఫారుఖీ షుబ్లీ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో విశాఖలోని అన్ని నియోజకవర్గాలకు కొత్తగా అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు. మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమితి నిరంతరం కృషి చేస్తోందన్నారు. అస్లం ఖాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎంతో గౌరవ ప్రదమైన పదవిని కేటాయించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఫారుఖ్ షుబ్లీ, ముస్లిం పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



అస్లం ఖాన్‌ను అభినందిస్తున్న సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారుఖ్ షుబ్లీ

మాదక ద్రవ్యాల నియంత్రణపై నేడు సదస్సు

మహారాణిపేట: జీవీఎంసీ జోన్-4 కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. జిల్లాకు చెందిన రిటైల్ కెమిస్టులు, డ్రగ్గిస్టుల పాత్రపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, విశాఖ జిల్లా డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్టు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, జిల్లా ఔషధ నియంత్రణాధికారులతో పాటు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

మహావృక్షాల పరిరక్షణ మన బాధ్యత

సీతమ్మధార: చిల్డ్రన్స్ మూమెంట్ ఫర్ క్లైమేట్ జస్టిస్ నేతృత్వంలో శుక్రవారం వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. సీతమ్మధారలోని ఓ వృక్షానికి స్థానికులు, విద్యార్థులు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సిఫా ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ శశిప్రభ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహావృక్షాలను పరిరక్షించుకోవడం మన బాధ్యతని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గ్రీన్ అంబాసిడర్స్ విద్యార్థులు అధిక సంఖ్యలో విత్తనాలతో కూడిన రాఖీలు తయారు చేశారన్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు వాడవాడలా వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.



సీతమ్మధారలో వృక్షానికి రాఖీ కడుతున్న స్థానికులు, విద్యార్థులు

నీటి నిల్వలు లేకుండా చూడండి

మద్దిలపాలెం: ఇంటి పరిసరాల పరిశుభ్రతతోపాటు నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని జిల్లా మలేరియా విభాగం ఆరోగ్య కార్యకర్త కోనా వేణు సూచించారు. శివాజీపాలెం లక్ష్మీనగర్ 2వ లైన్‌లో శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను గుర్తించి వాటిని జీవీఎంసీ యాంటీ లార్వా ఆపరేషన్ సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఇంట్లో నిత్యం వాడుక నీరు ఎప్పటికప్పుడు కాలువలోకి వెళ్లేలా శుభ్రం చేసుకోవాలన్నారు. పూజ గదుల్లో చెంబులతో పెట్టే నీరు వారానికి పైగా ఉంటే వాటిలో సైతం దోమలు ఉత్పత్తి చెందుతాయని, వాటిని తొలగించాలని సూచించారు. దోమ కాటు ద్వారా జ్వరాలు వ్యాప్తి చెందుతాయని, వాటి నుంచి రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్దిలపాలెంలో నిర్వహించిన ఇంటింటి సర్వేలో ఆరోగ్య కార్యకర్త శేషుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



శివాజీపాలెంలో ఓ ఇంటి వద్ద నీటి నిల్వలను పరిశీలిస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

పోలీస్ క్వార్టర్స్ అభివృద్ధి

అల్లిపురం : గత నెలలో అల్లిపురం పోలీస్ క్వార్టర్స్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ కుటుంబాలు ఆయనకు క్వార్టర్స్ నిర్వహణ నిమిత్తం ఒక పీసీ లేదా హోంగార్డును నియమించాలని కోరారు. ప్రత్యేకంగా త్రిశూల్ బ్లాక్‌పైన లీకేజీ, పోలీస్ క్వార్టర్స్ చుట్టుపక్కల పొదలు తొలగించమని, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రపరచాలని, తక్కువగా ఉన్న లైటింగ్‌ను పెంచాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, డక్ట్ ఏరియాలను మూసివేయాలని కోరారు. దీనికి స్పందించిన సీపీ పనులను సకాలంలో పూర్తి చేయించి శుక్రవారం ప్రారంభించారు.

డీఎస్సీలో సీఆర్పీలకు వెయిటేజీ ప్రకటించాలి

- ఉద్యోగుల జేఏసీ నాయకుల విజ్ఞప్తి

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ-24లో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ కల్పించాలని ఉద్యోగుల జిల్లా జేఏసీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కంచరపాలెం బీఎస్ఆర్ భవనంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విశాఖ జిల్లా జేఏసీ ప్రతినిధులు పి.గణపతి, లంక చైతన్య శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీఈడీ, టెట్ పరీక్షలు పాసై సమగ్ర శిక్షలో 12 ఏళ్లుగా చాలీచాలనీ జీతాలతో ఉద్యోగాలు చేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ ఇచ్చి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-3, జోన్-4 పరిధి పలు ప్రాంతాల్లో శనివారం తాగునీటికి అంత రాయం ఏర్పడనుందని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీరు కేవీఎస్ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవీఎంసీ టీఎస్ఆర్ నుంచి హైలెవల్ రిజర్వాయర్‌కి మంచినీటిని సరఫరా చేసే 400 ఎంఎం డయా సీఐ పైపులైన్ మరమ్మతులకు గురైనందున, మరమతులు చేసే విషయమై శనివారం ఆయా జోన్ల పరిధి పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని చెప్పారు. 20వ వార్డు ఈస్ట్‌పాయింట్ కాలనీ, పెదవాల్తేర్, 21వ వార్డు మహిళ వీధి, విద్యానగర్ కాలనీ, రెల్లివీధి, ఏయూ అవుట్‌గేట్ డౌన్, ఓల్డ్ సీబీఐ డౌన్, మైత్రీనగర్, వినాయఘర్ అపార్టుమెంట్స్, స్విమ్మింగ్ పూల్ ఏరియా, పాండురంగాపురం, బీచ్‌రోడ్డు సబ్‌మెరైన్, ఓషన్ వ్యూ లేఅవుట్ ఏరియా, చినవాల్తేర్ ఏరియా, 22వ వార్డులో బాలాజీనగర్, టైమ్స్ ఆఫ్ ఇండియా, సిద్ధార్థనగర్, 24వ వార్డులో పాత రేసపువానిపాలెం, వినాయకనగర్, తులసిపేట, స్వర్ణభారతి స్టేడియం ఏరియా, 27వ వార్డులో అశోక్‌నగర్, రామాటాకీస్ రోడ్డు, శ్రీనగర్, బుదిల్‌పార్క్ రోడ్డు, రెడ్డి ఆస్పత్రి రోడ్డు, శ్రీనగర్ సాయిబాబా టెంపుల్ రోడ్డు, ద్వారకానగర్ రోడ్డు నంబరు 1 నుంచి 6వ లేన్ వరకు, అమర్‌నగర్ చర్చి రోడ్డు, సీబీఎం కాంపౌండ్, రామాటాకీస్ లేడీస్ గేట్ బుకింగ్ రోడ్డు, 28వ వార్డులో ఫేకర్ లే అవుట్, కైలాసమెట్ట, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుంది. ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేయనున్నట్లు పర్యవేక్షక ఇంజినీర్ తెలిపారు.